క్లుప్తంగా

రుద్రారంలో వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మల్హర్: మండలంలోని రుద్రారం గ్రామంలో తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి వినయ్ భాస్కర్ 96 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం సీజన్‌లో పాటించాల్సిన సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాదర్శి సాయిచరణ్, హెల్త్ సూపర్ వైజర్స్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల: మండలంలోని రాంనగర్ కాలనీకి చెందిన కట్కూరి కుమార్ సెల్‌ఫోన్ ఎక్కడో పోగొట్టుకున్నాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి గురువారం బాధితుడికి అందజేశారు. సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డీటీఎఫ్ భూపాలపల్లి, గణపురం మండలాల బాధ్యులు ఎస్ వీరన్న కోరారు. భూపాలపల్లి మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగం విధ్వంసం అవుతుందన్నారు. ఉపాధ్యాయులకు రావల్సిన పెండింగ్ బిల్లులు, పీఆర్‌సీ అమలు చేయాలని, సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రతి పాఠశాలను తిరుగుతూ పాఠశాలల సమస్యలతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను సేకరించినట్లు తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలల సమస్యలతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్, అపర్ణ, గోవర్ధన్, నరేష్ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతిలో పత్తి సాగు

- బెడ్ పద్ధతిపై రైతుల ఆసక్తి
- తగ్గనున్న పెట్టుబడి ఖర్చులు



బెడ్ పద్ధతిలో సాగవుతున్న పత్తి

రేగొండ: ప్రతీ ఏటా అతివృష్టి కారణంగా రైతులకు ఆశించిన దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులు ఎలాగైన నష్టాల నుంచి బయట పడేందుకు పత్తి సాగులో ఆధునిక పద్ధతులకు శ్రీకారం చుట్టారు. బెడ్ పద్ధతి ద్వారా ఈ ఏడాది మండలంలో అధికంగా పత్తి సాగు చేస్తున్నారు.

సాగు విధానం ఇలా..

పత్తి విత్తుకునే ముందుగా మూడు నుంచి నాలుగు ఫీట్ల వెడల్పుతో బెడ్‌ను తయారు చేస్తారు. రెండు బెడ్‌లు దాదాపుగా ఫీట్ ఎత్తులో చేయడంతో వాటి రెండింటి మధ్యలో చిన్న కాలువ ఏర్పడుతుంది. ఈ బెడ్‌పై అడుగు దూరంలో పత్తి విత్తనాలు విత్తుకుంటారు. అధికంగా వర్షం కురిసినా నీరు పంట పొలంలో నుంచి కాలువల ద్వారా బయటకు వెళ్లిపోతుంది. బెడ్‌పై ఉన్న పత్తి కర్రకు ఎలాంటి హానీ ఉండదు. ఇలాంటి పద్ధతిలో విత్తుకోవడం ద్వారా గాలి వీచి కాత, పూత రాలిపోకుండా ఉంటుంది.

ఖర్చులు తగ్గించుకోవచ్చు



బెడ్ పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా చాలా ఖర్చులు తగ్గుతాయి. పత్తిలో కలుపు తీయడం, నాలుగైదు సార్లు దౌర కొట్టే అవసరం ఉండదు. గడ్డి మందు పిచికారీ చేయడం ద్వారా గడ్డిని నివారించవచ్చు. దీంతో భారీగా ఖర్చులు తగ్గుతాయి.

– రఘుసాల తిరుపతి, కొత్తపల్లిగోరి

దిగుబడి పెరుగుతుంది



ఈ ఏడాది ఎక్కువగా బెడ్ పద్ధతిలో పత్తి సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఈ పద్ధతి సాగు మంచిది. సాగు ద్వారా పంటలో నీరు నిల్వకుండా ఉంటుంది. పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది.

–పెద్ది వాసుదేవారెడ్డి, ఏఓ, రేగొండ

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సంపత్‌రావు

- డీఎస్పీ సంపత్‌రావు

గణపురం: అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ సంపత్ కుమార్ అన్నారు. మండలంలోని చెల్పూరు శివారు బోబ్బులోనిపల్లెలో గురువారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, చిల్యాల సీఐ మల్లేష్ యాదవ్, గణపురం ఎస్సై రేఖ అశోక్‌తో పాటు రేగొండ, చిట్యాల, భూపాలపల్లి ఎస్సైల ఆధ్వర్యంలో దాదాపు 60 మంది సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు కార్డన్ సెర్చ్‌లో 5లీటర్ల గుడుంబాతో పాటు, 500 లీటర్ల గుడుంబా తయారీ పానకాన్ని పట్టుకొని ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేశారు. సరైన పత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలకు రూ.17400 ఫైన్ విధించి, పెండింగ్ బకాయిలు ఉన్న 10 ద్విచక్ర వాహనాల నుంచి రూ.11750 బకాయిలను వసూలు చేశారు. ఎలాంటి పత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సంపత్ రావు మాట్లాడుతూ.. గ్రామంలో అసంఘిక కార్యకలాపాకలు పాల్పడితే వెంటనే పోలీసులకు తెలుపాలన్నారు. యువత గంజాయికి అలవాటు కావద్దన్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



మాట్లాడుతున్న శ్రీనుబాబు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల/భూపాలపల్లి: హైదరాబాద్‌లో నేడు(శుక్రవారం) తలపెట్టిన గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం చిట్యాల మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో, జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమ్మేళన కార్యాక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ మోత్కూరి ధర్మారావు, ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, నాయకులు చిలుకల రాయకొమురు, కామిడి రత్నాకర్‌రెడ్డి, దొడ్డి కిష్టయ్య, తోట గట్టయ్య, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖర్గే సభను విజయవంతం చేయాలి

కాటారం: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 4న నిర్వహించనున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖార్గే సభను విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు పిలుపునిచ్చారు. మండలంలోని ధన్వాడలో మంత్రి శ్రీధర్‌బాబు స్వగృహంలో మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో శ్రీనుబాబు గురువారం సమావేశం నిర్వహించారు. గ్రామశాఖ అధ్యక్షులతో ఏఐసీసీ అధ్యక్షుడు నేరుగా సమావేశం నిర్వహించడం మొదటిసారి అని అన్నారు. ఈ సమావేశంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, పలు మండలాల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, అయిలి ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, తెప్పెల దేవేందర్‌రెడ్డి, అంగోతు సుగుణ, జాడి మహేశ్వరీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెనిఫిట్స్, డీఏలు వెంటనే విడుదల చేయాలి



డీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

కాళేశ్వరం: పెండింగ్ బిల్లులు, పదవి విరమణ బెనిఫిట్స్, పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, మహదేవపూర్ జోన్ బాధ్యులు బొమ్మన తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు మడక మధు, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సారంగపాణి ప్రభుత్వాన్ని కోరారు. మహదేవపూర్ డీటీఎఫ్ మండల శాఖ వార్షిక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సూరారం, బొమ్మపూర్, అంబటిపల్లి రాపల్లికోట పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి బడ్జెట్లో 15% నిధులు కేటాయించాలని అన్నారు. కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని వృత్తి నిబద్ధత సామాజిక బాధ్యతలో భాగంగా ఉపాధ్యాయులు డీటీఎఫ్ సంఘంలో చేరి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యావ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సీహెచ్ మొండయ్య, మేకల ఎర్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు భిక్షపతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇసుక డంప్ సీజ్



సీజ్ చేస్తున్న అధికారులు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి శివారు కలికోట డబుల్ బెడ్రూంల వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను గురువారం రెవెన్యూ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. అనంతరం తహసీల్దారు విజయలక్ష్మి మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను చలివాగు, మానేరుల నుండి అక్రమంగా ఇసుకను తరలించినా, డంప్ చేసినా కేసులు నమోదు చేస్తామన్నారు.

పరామర్శ

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని 22 వార్డు మాజీ కౌన్సిల్ ముంజాల రవీందర్ తండ్రి అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గురువారం పరామర్శించారు. దహన సంసంస్కార కార్యక్రమంలో పాల్గొని మృతుడి పాడి మోశారు. పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

దుబ్యాలలో..

టేకుమట్ల: మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సంగి రవి కాలుకి ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. దీంతో ఆయనను కాంగ్రెస్ నాయకులు గురువారం పరామర్శించి, ఆరోగ్యంపై ఆరా తీసారు. జిల్లా నాయకులు దొంతుల శ్రీనివాస్, నాంపెల్లి వీరేశం, శాస్త్రాల కిరణ్, బండి రవి, సంపత్‌రావు, రవీందర్, తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- ఎస్సై చల్ల రాజు



మొక్క నాటుతున్న ఎస్సై రాజు

వెంకటాపురం(ఎం): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎస్సై చల్ల రాజు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని లక్ష్మీదేవిపేట పాఠశాల ఆవరణలో ఎంపీఓ శ్రీనివాస్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మానవ మనుగడకు మొక్కలే జీవనధారమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు తమ ఇంట్లో మొక్కలు నాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు సర్వర్ అహ్మద్, నాయకులు కారుపోతుల యాదగిరి, కొండ తిరుపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

కాటారం: మండలంలోని దామెరకుంటలో ఏర్పాటు ఓ ప్రైవేటు నెట్‌వర్క్‌కు చెందిన సెల్ టవర్ ప్రమాదవశాత్తు గురువారం దగ్ధమైంది. ప్రమాదవశాత్తు సెల్ టవర్‌లో మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజన్ వచ్చే లోగా మంటలు పెద్ద ఎత్తున వ్యాపించి సెల్ టవర్‌తో పాటు టవర్‌కు సంబంధించిన పలు సామగ్రి దగ్ధమైంది. సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పారు. అగ్ని ప్రమాదంలో రూ.కోటి నష్టం వాటిల్లినట్లు సమాచారం.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నూతన ప్రవేశం పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రేగొండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. గురువారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో ప్రవేశాల సంఖ్యను పెంచడానికి ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం సత్ఫాలితాలనిస్తోంది. ప్రభుత్వం మెరుగైన సదుపాయాలను కల్పించి నాణ్యంగా బోధిస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పిస్తున్నారు. కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో 16 మంది, 7వ తరగతిలో 9మంది, 8వ తరగతిలో 7మంది, 9వ తరగతిలో ఒకరు, 10వ తరగతిలో ఇద్దరు విద్యార్థులు నూతనంగా ప్రవేశం పొందినట్లు తెలిపారు.

ఎక్కడి చెత్త అక్కడే..



రోడ్డు పక్కనే ఉన్న పిచ్చిమొక్కలు



పాఠశాల ఎదుట ఉన్న చెత్తాచెదారం

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఏటూరునాగారం: మేజర్ గ్రామ పంచాయతీ ఆరో వార్డులోని మురుగు కాల్వలు అధ్వానంగా మారాయి. రోడ్లపై ఉన్న చెత్తాచెదారం ఎక్కడబడితే అక్కడే దర్శనమిస్తోంది. పశువులు ప్లాస్టిక్‌ను తిని మృత్యువాత పడుతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు, కార్యాలయం సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో కాల్వల్లో చెత్తా పేరుకుపోతోంది. అంబేద్కర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో ఉన్న కాల్వల్లో మోకాలిలోతు చెత్తాచెదారం పేరుకుపోయింది. కాల్వల్లో చెత్తాచెదారం శుభ్రం చేసేందుకు సరైన సిబ్బంది లేక పంచాయతీ పాలన నీరుగారిపోతుంది. అంతేకాకుండా గ్రామ పంచాయతీకి ఉన్న ట్రాక్టర్ ట్రాలీ సైతం తుప్పు పట్టి పోవడంతో చెత్తాచెదారం వేయడానికి సరైన ట్రాలీని కూడా పంచాయతీ అధికారులు సమకూర్చడం లేదు.

ప్రత్యేక పాలన అధ్వానం

సర్పంచ్‌ల పదవి కాలం ముగిసి రెండేళ్లు దగ్గరికి వస్తున్నా ఇంత వరకు ఎన్నికలు జరగక పోవడంతో ప్రత్యేక పాలన అధ్వానంగా మారింది. గ్రామ పంచాయతీ అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. చెట్లను నరికివేసి రోడ్లపైనే పడవేయడంతో రోడ్లపై వాహనాలు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలం కావడంతో వర్షపు నీరు సైతం కాల్వల్లో నిండి ఇళ్లలోకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి ప్రజల ఇబ్బంది తొలగించాలి.



6వ వార్డులోని కాల్వల్లో ఉన్న చెత్తాచెదారం

కాల్వలు శుభ్రం చేయాలి



పాఠశాల ముందు ఉన్న కాల్వలు అధ్వానంగా చెత్తాచెదారంతో నిండి ఉన్నాయి. దానివల్ల దుర్వాసన వస్తుంది. గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు స్పందించి కాల్వలో చెత్తాచెదారం తొలగించి నీరు సరఫరా అయ్యే విధంగా చూడాలి. పిల్లలు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వెంటనే స్పందించి శుభ్రం చేయాలి.

– సోలం సత్యం, హెచ్ఎం

చెత్తాచెదారం తొలగించాలి



గ్రామంలోని వార్డుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలి. రోడ్లు, కాల్వలను శుభ్రం చేయకపోవడం వల్ల దోమలు మరింత పెరిగాయి. కాల్వల్లో చెత్తాచెదారం వల్ల ఇళ్లలోని నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోతుంది. దానివల్ల వ్యాధులు వస్తున్నాయి. రాత్రివేళలో దోమల బెడద ఎక్కువగా ఉంది. కాల్వలు, రోడ్లు శుభ్రం చేసి ఆదుకోవాలి.

– జనగాం లక్ష్మయ్య, ఏటూరునాగారం

కమిటీ ఎన్నిక



నియామక పత్రం ఇస్తున్న నాయకులు

మల్హర్: మండల కేంద్రం తాడిచర్లలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కేసారపు నరేష్ ఆధ్వర్యంలో గురువారం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా ఖమ్మంపల్లి సందీప్, ఉపాధ్యక్షులుగా ఇందారపు రాజ సమ్మయ్య, ఇందారపు సాగర్, ప్రధాన కార్యదర్శిగా జంగం పోశయ్య, సహాయ కార్యదర్శిగా తుంగపల్లి రమేశ్, ప్రచార కార్యదర్శిగా జంగం సమ్మయ్య, కోశాధికారిగా ఇందారపు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులుగా తాండ్ర మల్లేష్, కేసారపు చంద్రయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తాండ్ర దినేష్, సీనియర్ నాయకుడు మంతెన సమ్మయ్య, ఇందారపు ప్రభాకర్, నారామల్ల నవీన్ పాల్గొన్నారు.

డోజర్ ట్రాక్టర్ సీజ్

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని ఆజాంనగర్ పరిధిలోని నాగారం గ్రామ సమీపంలో పోడు భూముల్లో సాగుకు కోసం చదను చేస్తున్న డోజర్ ట్రాక్టర్‌ను గురువారం అటవీశాఖ అధికారులు సీజ్ చేశారు. ఆజాంనగర్ రెంజ్ ఇన్‌చార్జ్ అధికారి రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజులుగా రాత్రి పూట పోడుముల్లో డోజర్ ట్రాక్టరత్లో భూమి చదును చేస్తున్నట్లు అధికారులకు సమాచారం అందడంతో సిబ్బందితోపాటు నాగారం గ్రామానికి వెళ్లారు. కాగా, కొంతమంది పోడుదారులు, ట్రాక్టర్ల యజమానులు అడ్డుకోడంతో అటవీ శాఖ అధికారులు పోలీసుల సహకారంతో నాగారం గ్రామానికి చెందిన విజేందర్ అనే వ్యక్తికి చెందిన డోజర్ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అడవీ గ్రామాల్లో అనుమతి లేకుండా పోడు భూముల్లో సాగు చేస్తే, సాగుదారుడితో పాటు ట్రాక్టర్ యాజమానులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

రమేశ్ మృతికి కారకులను శిక్షించాలి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ములుగు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హుడై ఉండి ఇళ్లు రాకపోవడంతో సామాజిక మాధ్యమాలలో ప్రశ్నించిన యువకుడు చుక్క రమేశ్ మృతికి కారణమైన కాంగ్రెస్ గుండాలను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే పెద్దిసుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో రమేశ్ మృతదేహాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరి పోతున్నాయని ఆరోపించారు. ఇందిరమ్మ ఇంటి విషయం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌పై సామాజిక మాధ్యమాలలో వచ్చిన వార్తను వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేసిన కారణంగా యువకుడిని బెదిరించి పోలీస్‌లతో భయభ్రాంతులకు గురి చేయడంతో మనోవేదనకు గురై యువకుడు ఉరి వేసుకోసి మృతి చెందాడని తెలిపారు. యువకుడి మృతికి రాష్ట్ర పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క బాధ్యత వహించాలని అన్నారు. రమేష్ కుటుంబానికి ప్రభుత్వం రూ. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్‌రెడ్డి, పోరిక గోవింద్‌నాయక్, భూక్య జంపన్న ఉన్నారు.

సామాన్యుడికి ఆర్‌టీఐ వజ్రాయుధం

మొగుళ్లపల్లి: సమాచార హక్కు చట్టం సామాన్యుడికి వజ్రాయుధం లాంటిదని సహ చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు చర్లపల్లి వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సహ చట్టం కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాలనలో జవాబుదారీతనం పెంచడానికి సహ చట్టం దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు అవుతున్నాయో లేదో తెలుసుకోవచ్చని అవినీతి అక్రమాలను వెలికి తీసేందుకు సహ చట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బండారి కుమార్ యాదవ్, కో కన్వీనర్‌గా బత్తిని బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.